క్లుప్తంగా

అద్దంకి పురపాలక సంఘ సమావేశం నేడు

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులంతా సకాలంలో హాజరుకావాలని కోరారు.

జూలై 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ

చినగంజాం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు జూలై ఒకటో తేదీ నుంచి ఇంటి వద్దకే నగదు అందజేస్తారని ఎంపీడీవో యూ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెంచిన లబ్ధిదారులు మొత్తం 6040 మంది కాక వారికి మొత్తం రూ.4.11 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు ఇతర అధికారులతో ప్రతి లబ్ధిదారుడికి ఇంటి వద్దకి అందజేయనున్నట్లు తెలిపారు.

చిరుజల్లులతో హర్షం

బల్లికురవ: ద్రోణి ప్రభావంతో బుధవారం నుంచి వాతావరణం చల్లబడింది. బుధవారం అర్ధరాత్రి నుంచి చిరుజల్లులతో వర్షం కురిసింది. ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాల్లో దుక్కులు దున్నారు. గట్టి వర్షంతో భూములు పదునెక్కితే విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు.

ఘనంగా గోపూజా మహోత్సవం


గోశాలలోని గోవులను పూజిస్తున్న భక్తులు

చీరాల రూరల్: స్థానిక పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాల నందు గురువారం వేదపండితుల ఆధ్వర్యంలో గోపూజా మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా గోశాలలోని గోవులను పసుపు, కుంమలతో సుందరంగా అలంకరించారు. భక్తులు గోవులకు హారతులిచ్చి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భక్తులు గోవులకు ఇష్టమైన గడ్డి, ఆకుకూరలు, అరటిపండ్లు వంటి ఆహార పదార్థాలు అందించి సంతోషం వ్యక్తం చేశారు. గోవులను పూజిస్తే అంతా మంచి జరుగుతుందని వేదపండితులు తమ సందేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గోశాల నిర్వహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి

చీరాల టౌన్: పంచాయతీల్లో ఎక్కడా డయేరియా వ్యాప్తి చెందకుండా అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీడీఓ శోభారాణి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మెడికల్, ఆర్డబ్ల్యూఎస్, ఏపీఎం, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలతో ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా రాకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పంచాయతీల్లో తాగునీటిని బ్లీచింగ్ చేయించాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి చెత్తకుప్పలు, వ్యర్థాలు, మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేసి డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలుశాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, ఏఎన్ఎంలున్నారు.

సుచరిత కుటుంబానికి ఇంటి స్థలం ఇవ్వాలి

చీరాల అర్బన్: చీరాల మండలం ఈపూరుపాలెంలో కిరాతకంగా హత్యాచారానికి గురైన సుచరిత కుటుంబానికి ప్రభుత్వం నివేశన స్థలం కేటాయించాలని ఇల్లు కట్టించి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. గురువారం చీరాలలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఊటుకూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదులు, మేధావుల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుచరిత చెల్లెలికి ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఎక్స్‌గ్రేషియా ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదన్నారు. హత్యలు చేసి బెయిల్‌పై తిరుగుతున్న నేరస్తులను జనజీవితంలో విచ్చలవిడిగా వదిలేయడం ద్వారానే నేరస్తులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. చీరాలలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైమా హాస్పిటల్ అధినేత డాక్టర్ జి.సుబ్బారావు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు, సీపీఐ సీనియర్ నాయకులు మేడా వెంకటరావు, అచ్చుతుని బాబూరావు, సీనియర్ సిటిజన్ నాయకులు గాదె హరిహరరావు, సింహాద్రి యలమందారెడ్డి, సూర్యప్రకాశరావు, బక్క జయరామిరెడ్డి, శీలం వెంకటేశ్వర్లు, మాచర్ల మోహన్‌రావు, బీరక పరమేష్, రామేశ్వరకుమార్, పి.కొండయ్య, మణిబాబు, చేనేత జనసమాఖ్య నాయకులు, దేవాంగ సమితి నాయకులు పాల్గొన్నారు.

వామ్మో.. వంతెనలా!

- మలుపుల్లో తరచూ ప్రమాదాలు
- గత పది సంవత్సరాల్లో 22 మంది మృతి, 40 మందికి తప్పిన ప్రాణాపాయం
- ప్రతిపాదనలతో సరి
- పొంచి ఉన్న ప్రమాదాలు


వల్లాపల్లి: ధర్మవరం మధ్య కూలే దశలో బ్రిడ్జి

బల్లికురవ: మండలంలో వంతెనలు ఎప్పుడు కూలుతాయోనని అంతా ఆందోళన చెందుతున్నారు. బల్లికురవ, అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. ఈ రోడ్డులో సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువను దాటే చోట వల్లాపల్లి–ధర్మవరం గ్రామాల మధ్య ఉన్న సింగిల్ బ్రిడ్జి జీర్ణావస్థతో కూలేదశకు చేరింది. ఆ బ్రిడ్జి నిర్మించి ఐదున్నర దశాబ్దాలు అయింది. అప్పట్లో రైతులు, పశువులు, వ్యవసాయ పంట ఉత్పత్తులు తరలించేందుకు సింగిల్ బ్రిడ్జి నిర్మించారు. అనంతరం డబుల్ రోడ్డుగా విస్తరించి ఆరు సంవత్సరాలకు పైగా అయింది. నిత్యం బల్లికురవ, ఈర్లకొండ నుంచి గ్రానైట్, మీటరు, ముడిరాళ్ల లారీలు 70 టన్నులు నుంచి 80 టన్నులు ఈ బ్రిడ్జి మీదగానే వెళుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ఎప్పుడు కూలుతోందో..

జీర్ణావస్థతో ఎప్పుడు కూలుతోందో రాకపోకలు స్తంభిస్తాయోనని మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి మండలాల్లో 40 గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులకు తోడు ఇక్కడే మలుపు ఉంది. ఇది గుర్తించేలా సూచిక బోర్డులు లేకపోవటం, బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న యాంగిలర్స్ వంగి దెబ్బతినటంతో గత దశాబ్ద కాలంగా బైకుపై వస్తూ కాలువలో పడి సుమారు 22 మంది చనిపోయారు. 40 మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రమాదం జరిగినప్పుడు అయ్యోపాపం అంటున్న అధికారులు ఆ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రతిపాదనలతో సరి...

రూ. 30 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులకు రూ. 2 కోట్లతో ఆర్ అండ్ బీ అధికారులు అంచనాలను తయారు చేసి పంపారు. ఆరు సంవత్సరాలుగా పరిశీలతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు.

లింకు రోడ్లలోనూ అవస్థలే..

మేదరమెట్ల – నార్కెట్‌పల్లి నామ్‌రహదారి రామాంజనేయ పురం నుంచి ముక్తేశ్వరం, గుంటుపల్లి–అంబడిపూడి మీదగా ఇసుక దర్శి, చెన్నై విజయవాడ జాతీయ రహదారిని కలిపే లింకు రోడ్డులోను బ్రిడ్జి కూలడంతో ఇబ్బందులు తప్పటంలేదు. ఈరోడ్డులోని రామాంజనేయపురం – ముక్తేశ్వరం గ్రామాల మధ్య చెన్నుపల్లి మేజరు కాల్వను దాటే చోట కల్వర్టుకు ఇరువైపుల ఉన్నగోడలు పడిపోయాయి. బైకులు ఆటోలు మినహా లారీలు, బస్సులు ఈ మార్గంలో వెళ్లే పరిస్థితి లేదు. ఈ విషయాలపై ఆర్అండ్‌బీ జేఈ శ్రీమన్నారాయణను వివరణ కోరగా ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదానికి ఇప్పటికి రెండు సార్లు పంపామని మరోసారి పంపుతామన్నారు.


ముక్తేశ్వరం- రామాంజనేయపురం మధ్య చెన్నుపల్లి మేజర్‌పై కూలిన కల్వర్టు గోడలు


ప్రమాదంలో కాల్వలో పడిన కారు (ఫైల్)

లింకురోడ్డు అభివృద్ధి పరచండి



రామాంజ నేయపురం – ముక్తేశ్వరం – గుంటుపల్లి – అంబడిపూడి, ఇసుకదర్శి లింకురోడ్డును అభివృద్ధితో రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలి. నామ్ రహదారి నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు, రైతులకు పంట ఉత్పత్తులు తరలించేందుకు ఇది దగ్గరి మార్గం. ఈ రోడ్డులో చెన్నుపల్లి, మేజర్ కాల్వ దాటే చోట కల్వర్టు పునఃనిర్మాణంతో రోడ్డు అభివృద్ధి పరచాలి.

– బూసా వెంకటేశ్వర్లు (రామాంజనేయపురం)

డబుల్ బ్రిడ్జితో ప్రమాదాలకు చెక్ పెట్టండి



వల్లాపల్లి–ధర్మవరం గ్రామాల మధ్య అద్దంకి బ్రాంచ్ కాల్వ దాటే చోట సింగిల్ బ్రిడ్జి స్థానంలో డబుల్‌బ్రిడ్జి నిర్మాణంతో ప్రమాదాలకు చెక్ పెట్టాలి. గత 10 సంవత్సరాల్లో ప్రమాదాల సంఖ్య పెరిగింది. అంచనాలతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు.

– బాదం హనుమారెడ్డి (వల్లాపల్లి)

కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి


యద్దనపూడి: కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందిస్తున్న తహసీల్దారు నాగరాజు

యద్దనపూడి: ఈ ఏడాది ఖరీఫ్.. రబీ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రెవెన్యూ శాఖ జారీ చేసే కౌలు గర్తింపుకార్డు (సీసీఆర్‌సీ) తీసుకోవాలని తహసీల్దారు నాగరాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందజేశారు. కౌలుకార్డు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ పథకాలు అందుతాయన్నారు. కౌలు రైతులకు ఈ కార్డుల ద్వారా భూ యజమానులకు అందించే అన్ని పథకాల లబ్ధి కౌలు రైతులకు కూడా లభిస్తుందని తెలిపారు. కౌలు రైతులు గర్తింపు కార్డుల కోసం రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకొని వీఆర్వోకు అందజేస్తే గర్తింపుకార్డు జారీ చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు మస్తాన్ రావు, ఆర్ఐ విష్ణు, ఆయా గ్రామాల వీఆర్వోలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అద్దంకి (సంతమాగులూరు): కౌలు రైతులు ఆర్‌బీకే కేంద్రాల వద్దకు వెళ్లి సీసీ కార్డులు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. గురువారం మండలంలోని ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్‌వోలకు కౌలు రైతు కార్డులపై అవగాహన నిర్వహించారు. మండలంలో మొత్తం 3500 కార్డులు లక్ష్యం కాగా వాటిలో గురువారం 382 కార్డులు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి కౌలు రైతు కార్డు పొందే విధంగా చూడాలని సూచించారు.

హ్యాండ్ వాష్‌పై అవగాహన

జె.పంగులూరు: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ అన్నారు. డయేరియా నిర్మూలనలో భాగంగా ముప్పవరంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో హ్యాండ్ వాష్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పద్మజ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భోజనం చేసే ముందు చేసిన అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, సూక్ష్మ క్రిములు దరిచేరకుండా చేసేందుకు తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. ముఖ్యంగా పిల్లలను ఆరోగ్యంగా ఉంచాలని, వారి ఆరోగ్యం పట్ల తల్లులు జాగ్రత్త వహించాలని కోరారు. పిల్లలు పలుచోట్ల ఆటలాడి దుమ్ముతో ధూళితో ఉన్న చేతులతో ఉంటారని, వాటిని సబ్బుతో శుభ్రం చేసుకున్న తరువాతనే భోజనం పెట్టాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు టి. ప్రసన్న, ఐ. శ్రీలక్ష్మి, పి. సుధారాణి, బి. శ్యామల, ఆయాలు జ్యోతి, సీహెచ్ ఆమని, ప్రసన్న లక్ష్మి, కె. రేణుక, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దాడి ఘటనలో అరెస్ట్

బల్లికురవ: మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీయటంతో క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు గురువారం ఒకరిని అదుపులోకి తీసుకుని అద్దంకి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్సై రవిశంకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పరపాడులో ఈనెల 20వ తేదీ రాత్రి కుంచాల రాంబాబు అదే గ్రామానికి చెందిన బుర్రి ప్రసన్నాంజనేయులపై దాడి చేయగా గాయాల పాలయ్యాడు. స్థానికులు ప్రసన్నాంజనేయులు ఒంగోలులోని ఓ ప్రయివేటు వైద్యశాలకు చికిత్సకు తరలించారు. చికిత్స పొందుతూ ఫిర్యాదు చేయగా రాంబాబును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివరించారు.

భక్తి శ్రద్ధలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు


వెంకటేశ్వర స్వామివారికి క్షీరాభిషేకం చేసేందుకు కలశాలతో వస్తున్న మహిళా భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానం 40వ వార్షిక బ్రహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన గురువారం 108 కలశాలతో క్షీరాభిషేకం చేసేందుకు మహిళా భక్తులు 108 కలశాలను తీసుకొని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులకు వైద్యం చేస్తున్న 108 సిబ్బంది

బల్లికురవ: పని నిమిత్తం మార్టూరు వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా అదుపుతప్పి కిందపడటంతో ఇరువురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ ఘటన గురువారం సాయంత్రం బల్లికురవ–మార్టూరు ఆర్అండ్ బీ రోడ్డులోని నాగురాజుపల్లి సమీపంలో గాయత్రి గ్రానైట్స్ మలుపు వద్ద జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన బి. సూర్య, జి. శ్రీకాంత్ బైకుపై వస్తూ అదుపు తప్పి కింద పడటంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. బల్లికురవ నుంచి వచ్చిన 108 వాహన ఈఎంటీ నాగరాజు, పైలట్ శ్రీకాంత్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి గుంటుపల్లి పీహెచ్‌సీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన ఇసుక దర్శి సమీపంలో జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల మేరకు.. భార్యాభర్తలు జంట కారులో ఒంగోలు వెళ్తున్నారు. ఇసుక దర్శి ఫ్లైఓవర్ పై వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. భర్త ముఖంపై, భార్య మెడపై తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఇరువురిని స్థానికులు హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఇరువురిని రోడ్డు పక్కకు తరలించారు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను అద్దంకి తరలించగా వారికి సంబంధించిన బంధువులు ఇరువురిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. హైవే సిబ్బంది ట్రాఫిక్ అవరోధాలను తొలగించారు.


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి తరలిస్తున్న సిబ్బంది

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న నిర్వాహకులు

చీరాల రూరల్: చీరాల మహిళా మండలిలో గురువారం ఆశారేఖా మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీతో బాధపడుతున్న 20 మంది రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. హెచ్ఐవీతో బాధపడే వారు క్రమం తప్పకుండా వైద్యుల సలహాల మేరకు మందులు వాడుతూ మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడవద్దని.. ధైర్యంగా ఉండి సమస్యను ఎదుర్కోవాలని సూచించారు. చీరాల ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్టీ సెంటర్లోని వైద్యులను సంప్రదించి మందులు వాడుకుంటూ వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ బాషా, ప్రాజెక్టు పీడీ ఆర్. శ్రీనివాసరెడ్డి, నాగేంద్రమ్మ, స్వాతి, చిన్ని, జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవల్లో శింగరకొండ రోటరీ ముందంజ


కార్యాలయానికి స్థల దాత చిన్ని మురళీ కృష్ణ దంపతులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉందని క్లబ్ మాజీ సెక్రటరీ చప్పిడి వీరయ్య అన్నారు. గురువారం స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో రోటరీ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24లో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా పని చేసిన చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరీ, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లెవీ ప్రసాద్‌లను 2024–25 సంవత్సరం నూతనంగా ఎన్నికైన నూతన కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా మాజీ సెక్రటరీ చప్పిడి వీరయ్య మాట్లాడుతూ ఒక్క సంవత్సరంలో రూ. 8 లక్షలతో 150కి పైగా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెలలో భద్రాచలంలో జరిగి రోటరీ డిస్ట్రిక్ట్ అవార్డ్స్‌లో అద్దంకి క్లబ్‌కు 6 అవార్డు వచ్చినట్లు తెలిపారు. రోటరీ కార్యాలయ నిర్మాణానికి 8 సెంట్ల స్థలాన్ని ఉదారంగా ఇచ్చిన మాజీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ దంపతులను ప్రత్యేకంగా అభినంది సత్కరించారు. పూర్వ అసిస్టెంట్ గవర్నర్ వీరవల్లి రుద్రయ్య, పుట్టం రాజు శ్రీరామచంద్ర మూర్తి, ఉబ్బా దేవపాలన, గాడేపల్లి దివాకర దత్తు, నర్రా శ్రీలక్ష్మి, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళి సుధాకర్, అళహరి హరిబాబు, యెగా గురువు శేషారెడ్డి పాల్గొన్నారు.

పోరాటంతో సమస్యల పరిష్కారం


రైతుల సంఘం ప్రతినిధులతో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

జె.పంగులూరు: రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం రైతులు పోరాటం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం పంగులూరు రైతు సంఘం సీనియర్ నాయకులు మానం హరిబాబు అధ్యక్షతన జరిగిన మండల రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రధాన కాలువలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, మేజర్ కాలువల్లో చిల్ల చెట్లలను తొలగించి, సాగునీటి పారుదలకు అనువుగా కాలువ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని కృష్ణయ్య అన్నారు. కాలువ ద్వారానే కాకుండా భవనాసి రిజర్వాయర్, పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో సాగునీటి అవకాశాలున్నాయని, ఆ రెండు ప్రాజెక్టు ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకోసం మండల రైతాంగం ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుడిపూడి మల్లారెడ్డి, గరికపాటి శంకర్, నాదెళ్ల శ్రీనివాసరావు, మద్దినేని సురేష్, వెంకటరావు, ఆంజనేయులు, కరణం రామయ్య, చిలుకూరి శేఖర్, నాయపాలు ప్రభాకర్, ఇంటూరి శ్రీనివాసరావు, తానికొండ సుధాకర్, తల్లపనేని సుధాకర్, రాయిణి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ చట్టాల పుస్తకాలు అందజేత


పుస్తకాలను లైబ్రరీకి అందిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: భారత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన న్యాయ పుస్తకాలను చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కొనుగోలుచేసి గురువారం బార్ అసోసియేషన్ హాలులోని లైబ్రరీకి ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి భారత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన న్యాయ పుస్తకాలు (చట్టాలు) అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పాత చట్టాల స్థానంలో ఈ కొత్త చట్టాలు ఉంటాయని చెప్పారు. (క్రిమినల్ బేర్ యాక్టు బుక్స్) పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచుతామని ప్రతి న్యాయవాది చదువుకొని కొత్త చట్టాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. సీనియర్ న్యాయవాదులు స్పందించి కొత్తగా జూనియర్ న్యాయవాదులుగా ప్రాక్టీసు చేసేవారికి కొత్తగా వచ్చిన న్యాయ పుస్తకాలను ఉచితంగా అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, బార్ జనరల్ సెక్రటరీ కొటిక ఉదయ భాస్కర్, లైబ్రరి సెక్రటరి సిరిపురపు కామేశ్వరరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వర రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నక్కబొక్కలపాడులో ముగిసిన కొలుపులు


నక్కబొక్కలపాడులో బొల్లావులతో గ్రామోత్సవం

బల్లికురవ: గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని నక్కబొక్కలపాడులో జరుగుతున్న పోలేరమ్మ, శ్రీ అంకమ్మ కొలుపులు గురువారంతో ముగిశాయి. గ్రామానికి ఆగ్నేయ భాగంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ, నైరుతి భాగంలో వేంచేసి ఉన్న అంకమ్మ ఆలయాలు ముస్తాబుతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకల్లో భాగంగా నాభిశిల, గవిడిరాళ్లకు విశిష్ట పూజలు చేపట్టారు. బొల్లావులు, వీరతాళ్లతో మేళతాళాల, డప్పు వాయిద్యాలు, పాట కచేరీతో గ్రామోత్సవం చేపట్టారు. ఈ వేడుకల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా అంతా పాల్గొన్నారు. గురువారం ఆయా ఆలయాల వద్ద తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, సోదరులు, పాడి- పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆడపడుచులు పొంగళ్లపెట్టి అమ్మవార్లకు నివేదించారు. శుక్రవారం రాత్రికి అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలి


మట్లాడుతున్న ఎంఈవో

అద్దంకి రూరల్: నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిధిలోని బాలబాలికలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈవో 1 గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఎన్‌రోల్‌మెంట్ ఏ పాఠశాలలో ఐతే పెరిగిందో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను బెస్ట్ స్కూల్ లీడర్‌గా గౌరవిస్తామన్నారు. జూలై 1 నుంచి డయేరియా నిర్మూలన కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని తరుచుగా నిర్వహించాలని కోరారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అకడమిక్ స్టాండర్స్ రిజిస్టర్ నిర్వహించి, ప్రతి వారం వీక్లీ టెస్టులు నిర్వహించాలన్నారు. ఎంఈవో- 2 బి. సుధాకరరావు స్కూల్ అసిస్టెంట్ చైర్మన్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.